# .విష్ణు సహస్రనామాలుఅంటే ఏమిటి.

## సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్

Regd. 192/2019



# అసలు విష్ణు సహస్రనామాలుఅంటే ఏమిటి ?

ఈ విష్ణు సహస్రనముల గురించి మనము ఇప్పుడు
విష్ణుసహస్రనామ అర్థాలు క్లుప్తముగా
భగవత్ ప్రేమకి పాత్రులం అయ్యేందుకే శ్రీ విష్ణు సహస్ర నామాలు.
**************

అతిప్రేమతో కానీ, అతి కోపంతో కానీ పలికే మాటలకు ఏమిటి అర్థం అని విచారణ చేయకూడదు. అతి ప్రేమను పొందిన వ్యక్తి ఆవలి వ్యక్తి ఏమి చెబుతున్నాడు అని విచారణ చేయకుండానే స్వీకరిస్తాడు.

అలానే అతి కోపంతో, అతి ద్వేశంతో పలికిన పలుకులని మనం ఏమిటి దీని తాత్పర్యం అని విచారణ చేయకూడదు. భగవంతుడిపై అతి ప్రేమతో మనస్సులో అనుభవించిన ఆనందాన్ని లోపల ఇముడ్చుకోలేక పైకి వెలువరిస్తే, దాన్ని తరువాతి వారు విని, తద్వారా మనవరకు ఉపదేశంగా వచ్చినవే శ్రీ విష్ణు సహస్ర నామాలు.

ప్రేమతో పాడుకున్నవి కనక వాటి అర్థం ఎంత అనే విచారణ అవసరం లేదు. వారు పాడుకున్నది అతి ప్రేమవల్ల అయినా ఆ కల్గిన ప్రతి కదలిక, చేసే ప్రతి చేశ్ట కూడా తరువాత వారికి చాలా ఉపాదేయం గానూ వారిని తరింపజేసేదిగానూ ఉంటుంది.

భగవంతుడిని తలచి ఏడిచినవారి ఏడుపు కూడా తరువాత వారికి గొప్ప రక్షగానే ఉంటుంది. 'హ్రూదురుః సుస్వరం రాజన్'- సుస్వరంగా వారంతా ఏడ్చిరి అంటూ పరిక్షిత్తుకి శ్రీసుఖ మహర్షి ఉపదేశం చేసేప్పుడు చెబుతాడు.

శ్రీరామచంద్రుడు వనవాసానికి వెళ్ళాల్సి వస్తుంది అని తలచిన కౌసల్య తను ఇటూ అటూ తత్తరపాటుతోటి, బెంగచేత, భాదపడుతూ పరుగులు పెడుతుంటే, ఆహా! అద్భుతమైన కౌశలం కల్గినటివంటి ఒక ఆమె 'నృత్యతీ మివ' నృత్యం చేస్తున్నట్టు అనిపిస్తుందట. అది ఒక నేర్పరి వేసిన అడుగులాగ. భగవంతుడి అనుభవం వల్ల వస్తున్నది కనక అది ఎంతో ధివ్యమైనదై, తరింపజేసేదై, అర్థవంతమయ్యే ఉంటుంది.

మామూలుగా భగవంతుడి గురించి చెప్పాలంటే ఎవరైనా, జాగ్రత్తగా శాస్త్రం చూసుకొని, అర్థం చేసుకొని చెప్తారు. ఎంత శాస్త్రం నేర్చినా పరిపూర్ణంగా ఉండవు, అనుభవం అనేది ఉండదు కాబట్టి. కానీ సహజమైన అనుభవం నిండిన వారి వెంట శాస్త్రాలు పరుగెత్తుతాయి. ఆ శాస్త్రంలో ఉన్న విదులు వారిని అనువర్థిస్తూ ఉంటాయి. లోకాన్ని ఉజ్జీవింపజేసే మాటలు అన్నీ కూడా నన్ను పలుకు అని వారికోసం వరుసన నిలబడుతాయి. అట్లా భగవత్ భక్తులు పొందిన అనుభవాన్ని తరువాతి వాల్లు తలచుకొని, ఇది మాకు రక్షకం అని ఉపాసిస్తూ ఉంటారు.

అట్లాంటి నామాలే శ్రీవిష్ణు సహస్రనామాలు. ఏవో కొన్ని తలచుకొని తృప్తిపడదాం అని చెప్పినవే కానీ ఇన్నే నామాలు అని కాదు. వాటిని తల్చుకుంటే భగవత్ ప్రేమకి పాత్రులం అవుతాం.

## విష్ణుసహస్రనామ అర్థాలు క్లుప్తముగా

### మొదటి శతకం(1-12వ శ్లో||) లో

***************

స్వామి మనకు ఏర్పడే సమస్యలని ఎట్లా దూరం చేస్తాడో తెలుపుతుంది. ఒక్కొక్కరికి ఒక్కో సమస్య, ఇలా ఎన్నో సమస్యలు ఎదురవుతుంటాయి. ఎవరికి ఎటువంటి సమస్యలొచ్చినా తొలగించగలిగినవాడు ఆయన.

అన్ని స్వమస్యలని పోగొట్టే వాడు కనుక అయన్ని మోక్షప్రదుడు అంటారు. మోక్షం అంటే శరీరంలోంచి బయటకు తేవడం కాదు సమస్యల్లోంచి బయటకి తేవడం. అట్లా మనల్ని సమస్యల్లోంచి బయటకు తేవడానికి తాను ఎట్లాంటి రూపాన్నైనా ధరిస్తానన్నాడు. అట్లా ధరించిన ఒక రూపమే మనిషి ఊహకి అందని రూపం.

ఒక స్తంభాన్ని తల్లిగా చేసుకొని అది మనిషియో సింహమో తెలియక వచ్చిన రూపం. ప్రహ్లాదునికి ఏర్పడ్డ సమస్య నుండి కాపాడటానికి అలాంటి రూపాన్ని దాల్చి వచ్చాడు. ఆయన చేసే రక్షణని మనం

అంగీకరిస్తునాం అనే దాన్ని తప్ప వేరొక ఉపాసనని ఆశించడు. నీవు ఇది చేస్తే నేను ఇది చేస్తా అనే వాడు కాదు ఆయన. నేను చేస్తా అనే నా మాటని ఒప్పుకున్నావే అని ఆయన మనపట్ల కృతజ్ఞత కలిగి ఉంటాడు.

మనం ఆయన పట్ల కృతజ్ఞత వహించటం కాదు ఆయన మన పట్ల కృతజ్ఞత కలిగియుంటాడట. నేను చేస్తున్న రక్షణని ఒప్పుకుంటున్నావు, నా ఔదార్యాన్ని సఫలం చేస్తున్నవు, ఇది నాకు చాలు అని పొంగిపోయే గొప్ప మనస్సు కలవాడు స్వామి. అట్లాంటి గొప్ప గుణములని చెప్పింది మొదటి శతకం

## రెండవ శతకం (13-21వ శ్లో||) లో

***************

స్వామి మనల్ని కాపాడటానికి ఏర్పరుచుకున్న వ్యూహాలను తెలుపుతుంది. తెలియక స్వామి మాటలని పలికినా కరిగేవాడు. చేతనమా అచేతనమా అనే ప్రశ్న లేదు, అన్నింటినీ కాపాడేవాడు స్వామి. మనం మేల్కోన్నప్పుడు, నిదురించేప్పుడు, సుశుప్త దశలో, అది దాటిన తరువాత దశలో రక్షణ చేయువాడు స్వామి. అందుకు వాసుదేవ, అనిరుద్ధ, ప్రద్యుమ్న మరియూ సంకర్షణ అనే వ్యూహాలని ఏర్పర్చుకొని కాపాడుతుంటాడు. ఆ వ్యూహాల్లోంచి అవతారాలు ఎత్తుతుంటాడు మన అవసరాల కోసం.

## మూడవ శతకం (22-32వ శ్లో||)

***************

మనల్ని అన్ని విధాలుగా వెయ్యికన్నులతో చూసుకొని కాపాడుకొనేవాడు స్వామి అని ఔదార్యాన్ని ఇస్తుంది. మనకోసం స్వామి ఎన్ని రూపాలైనా ధరిస్తాడు. అవసరానికి తగ్గ రూపం ధరిస్తాడు.

జ్ఞానాన్ని మనకు ఇవ్వటమే లక్ష్యంగా ధరిస్తాడు. ఆ జ్ఞానానికి మూలమైన వేదాలని కాపాడుతాడు. వేద విజ్ఞానాన్ని వివరించే మహానుభావులని సంరక్షణ తాను చేసి వారి ద్వారా భోద చేయిస్తాడు. అట్లా వేద విజ్ఞాన పరిరక్షణకై చేపవలే మత్స్యావతారాన్ని ధరించాడు. మనిషికి అవసరమైనప్పుడు తాను ముందుండి నడిచి ఎదురయ్యే కష్టాలని తాను అనుభవిస్తూ రక్షిస్తాడు.

## నాలుగవ శతకం(33-42వ శ్లో||)

*************

రామనామాన్ని తెలుపుతూ మృతసంజీవినిని ఇస్తుంది. ఎన్ని కష్టాలైనా నీకోసం నేను పడతా అని కూర్మరూపాన్ని దాల్చి చూపాడు స్వామి. పైన పర్వతాన్ని మోస్తూ, అటు రాక్షసులకి బలాన్ని ఇస్తూ, ఇటు దేవతలకి బలాన్ని ఇస్తూ, మధ్యన చుట్టిన పాముకి బలాన్ని ఇస్తూ అమృతాన్ని పుట్టించాడు. తన ఉపకారాన్ని వాడుకుంటే

అంతకన్నా నాకేముంది గనుక అని తాను పడే పరిశ్రమకి బెంగ చెందడు. మనకు ఎలా అయితే అలా తాను అనుకూలుడైపోతాడు. ఆయన పెట్టిన నియమాలని మనం కట్టుబడి ఉండటం కాదు మనం పెట్టిన నియమాలకి తాను కట్టుబడి ఉంటాడు.

మన సంపధలని, మన బుద్ధిని పెంచి అవి వినియోగించుకుంటుంటే పొంగిపోతాడు లేకుంటే కాంతి విహీనుడైపోతాడు. మనకి పునర్ జీవనాన్ని ఇచ్చే అవతారాలు ఎన్నో ఎత్తాడు. మనవలె మనిషిగా రాముడై వచ్చిన దాన్ని తలచుకుంటే మనలోని జవము, సత్వము మళ్ళీ ఉజ్జీవిస్తాయి.

స్వామి రామావతారాన్ని ఎత్తి తన భక్తులకి దాసుడై వాళ్ళకి సుఖాన్ని ఇచ్చి తాను అనందించాడు. మళ్ళీ క్షుద్రమైన అహంకారమనే మొసలి నోట పడనవసరంలేని స్థాయిదాకా చేర్చటానికి సిధ్ధపడి ఉంటాడు. అవసరమైన మంచి పరికరాలని తనలో పెట్టుకొని ఆయన ఉంటాడు. ఎప్పుడెప్పుడు ధర్మ నశిస్తే తిరిగి ధర్మాన్ని లోకంలో స్థాపన చేయటానికి దాన్ని ఆచరించే వ్యక్తులని తీర్చిదిద్దటానికి ఆయా కాలాల్లో అవతరిస్తాడు. ఈ యుగంలో కల్కి అవతారం ధరిస్తాడనే ప్రమాణాలు తెలుపుతున్నాయి. తెలియక దోశాలుచేసినా క్షమించగలిగే ఉదారుడు స్వామి. మనం చేయగలిగే పనులని యజ్ఞముగా మార్చగలిగేవాడు. దేవతలు కూడా ప్రభువైన వాడు, వాళ్ళు మనకి అనుకూలించేట్టు చేయగలిగిన వాడు.

మనకి హాని కలిగించేవారిని వేయికనులతో

నిగ్రహించేవాడని ఐదవశతకము

(43-53వ శ్లో||) తెలుపుతుంది.

**************

అవసరమైన విజ్ఞానాన్ని మనకి ఇవ్వడానికి ఎత్తిన అవతారాలు ఎన్నెన్నో. వేద విజ్ఞానాన్ని ఇవ్వడానికి మత్స్యావతారాన్ని,హంసావతారాన్ని, హగగ్రీవ అవతారాన్ని ధారణ చేసాడు.

జ్ఞానభోద చేయడానికి కపిలావతారాన్ని ఎత్తాడు. స్వామి వద్ద ఉండే ఆయుధాలు ఆభరణాలు భౌతికమైన వస్తువులు కాదు. పరమపదంలో ఉండే పంచోపనిషత్తులని దేహంగా మలచుకొని ఆ దేహం ఆ కాంతి ఆ ఆకృతి అదే ఒక మాయా మంత్రం లాంటిది. ఆ రూపాన్ని తనని చేరని ఉదాసీనులకి చూపి తన వైపుతిప్పుకునే మహనీయుడు స్వామి.

పరశురాముడివలె ఆవేశావతారంగా గ్రంథరచన

చేయడానికి వేద వ్యాసునిగా తానే వచ్చాడు అని

ఆరవ శతకం(53-63వ శ్లో||) తెలుపుతుంది.

*************

## ఏడవ శతకం(64-74వ శ్లో||)

***************

శ్రీసంబంధాన్ని స్తుతించింది. మనకోసమే ఆయన లక్ష్మిని వీడకుండా ఉంటాడు. లక్ష్మి లేకుండా మనల్ని అనుగ్రహించడానికి వస్తే ఆయనలోని స్వాతంత్ర్యం పైకి వస్తే నష్టం జరిగేది లోకానికే, అట్లా జరగకుండా చూసేది అమ్మ లక్ష్మిదేవి. అందుకే అమ్మన సాన్నిధ్యాన్ని ఎప్పటికీ దూరం చేసుకోడు. తన వక్షసీమలో సతతమూ ఉండేట్టు చేసుకుంటాడు. అమ్మ అంటే దయ, ఆ దయ పుట్టేది హృదయంలో అమ్మని ఎప్పటికీ పెట్టుకుంటాడు. అట్లా సంపదలని కలిగింపజేస్తాడు.

## ఎనిమిదవ శతకం(75-85వ శ్లో||)

***************

స్వామి మనల్ని అనుగ్రహించేందుకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉంటాడని స్తుతించింది. పొరపాటుగా దోశంచేసినా ఆయన చెడుగా తీసుకోడు. ఎవరు ఎలా అన్నా సహించటానికి వీలుగా ఈ లోకంలోకి వస్తాడు.

మనలో బుద్ధిని క్రమంగా ఏర్పడుస్తాడు. తాను అవసరమైనప్పుడు పాండవులకి సారథిగా, సంచారాన్ని చేరవేసే వార్తాహరుడైనట్లు

మనకోసం ఏపని చేయటానికైనా సిద్ధపడి ఉంటాడు. అన్ని రకాల ప్రయోజనాల్ని చేయడానికి నాలుగు చేతులు ధరించి ఉంటాడు.

ఆయా రూపం ద్వారా ధర్మార్థకామమోక్షాలని ఏది కోరుకున్నా అది ఇవ్వడానికి నాలుగు చేతులతో సిద్ధంగా ఉంటాడు. అట్లా అనుగ్రహించే స్వామిని, మన నుండి ఏమీ అపేక్షించని స్వామిని ఏమి చేయగలడు అని అనుకోకుంటే చాలు.

తాను విగ్రహ రూపంలో ఉన్నప్పుడు ఈయనేం చేస్తాడు అని అనుకోకుంటే చాలు మనకి అన్నీ ఇవ్వగలిగేందుకు తాను సిద్ధంగా ఉంటాడు.

## తొమ్మిదవ శతకం(85-96వ శ్లో||) లో

**************

అనేక పరస్పర విరుద్ధంగా అనిపించే నామాలు కనిపిస్తాయి. భగవంతుని నామాలకి అర్థం తెలియనవసరం లేదు అయినా పలుకవచ్చు.

అర్థం తెలియకుంటే భావించేది ఎలా అని సందేహపడనవసరం లేదు. అతి చిన్న స్వరూపం నుండి అతి పెద్ద స్వరూపం స్వామిది. లోకంలో

కనిపించే పొడవు, పొట్టి, గుణవంతుడు, గుణహీణుడు ఇలా అన్ని రూపాలు ఉండగలుగుతున్నాయి అంటే అది స్వామి ఉపస్థితి వల్లనే.

## పదవశతకం(96-108వ శ్లో||)

***************

స్వామి పుష్పంకంటే సుకుమారమైనవాడు. మనకోసం అవతారాలు ఎత్తి ఎన్ని కఠినమైన పనులైనా చేయటానికి సిద్ధపడుతాడు. ఆయన సౌకుమార్యం కందిపోయేలా మనకోసం కష్టపడుతాడు. మనకి ప్రాణాల్ని ఇస్తాడు, మనకి ప్రాణము తానే అవుతాడు. మనల్ని పుట్టుట గిట్టుట అనే విషవళయం నుండి బయటకు తీస్తాడు.

అలా తీయటానికి తాను వస్తాడు. మనకి పనులని తానే నేర్పుతాడు, ఆ పనులని యజ్ఞముగా మార్చుతాడు. యజ్ఞంతానే అయి తానే చేయించుకుంటాడు. యజ్ఞపరికరం తానే అవుతాడు.
ఫలాన్ని తానే ఇస్తాడు.

జీవుడిని ప్రకృతిని తానే తెలుసుకున్నవాడు. కనుకనే ప్రకృతి ఆకర్షణకి జీవుడు బంధించబడి ఉంటాడు కనుక ఆ బంధంనుండి బయటపడేట్టు ప్రయత్నాలు చేస్తాడు. అందుకే ఆయన చేసే సకల ప్రయత్నాలు, సకల మంత్రాలు. ఆస్వామిని విశ్వసిస్తే చాలు.